@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 20, జూలై 2024 || పేజీలు: 04

## నిండుకుండలా మేడిగడ్డ

- కాంగ్రెస్ కుట్రలు పటాపంచలయ్యాయ్..
- మేడిగడ్డ నిండుకుండలా కావడంపై కేటీఆర్ హర్షం
- త్వరలో కేటీఆర్ మేడిగడ్డ పర్యటన

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:

మేడిగడ్డ ఎందుకూ పనికిరాకుండా పోయిందని సీఎం రేవంత్ సహా ఇతర కాంగ్రెస్, తదితర పార్టీల నేతలు, సోషల్ మీడియా చేసిన దుష్ప్రభావాలు పని చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు పేర్కొన్నారు. గోదావరిలో వస్తున్న వరదతో మేడిగడ్డ బ్యారేజీ నిండుకుండలా మారడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తన ఎక్స్ అకౌంట్‌లో ఇలా రాసుకొచ్చింది. "కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు.. మిగతా 2లో..





## త్వరలో విద్యా కమిషన్

- అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు నాణ్యమైన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:

తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చుదానికి త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు నాణ్యమైన విద్య బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వ కట్టుబడి ఉందని సీఎంస్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం పై చర్చించేందుకు విద్యావేత్తలతో సచివాలయంలో రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు సాయంత్రం భేటీ అయిన సంగతి తెలిసిందే. విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం, టెట్ నిర్వహణ, ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించడం, పాఠశాలలు తెరిచిన రోజే పిల్లలందరికీ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందజేత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టిన విధానాన్ని రేవంత్ తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, విద్యావేత్తలు ఇచ్చే మంచి సూచనలు స్వీకరిస్తామని తెలియజేశారు. మిగతా 2లో..



## ఏపీలో అరాచకం.. రాష్ట్రపతి పాలన విధించాలి

రాష్ట్రపతి, ప్రధాని, హెూం మంత్రికి ఆధారాలతో నివేదిస్తాం

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో 24న ఢిల్లీలో ధర్నా
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:

'రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. గత 45 రోజులుగా శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఏ సామాన్యుడిని కదిలించినా ఇదే ఆవేదన వ్యక్తం అవుతోంది. టీడీపీ నాయకులు ఎవరినైనా కొట్టొచ్చు.. ఎవరి ఆస్తులనైనా ధ్వంసం చేయొచ్చు.. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడొచ్చనే రీతిలో పాలన నడుస్తోంది. అరాచకాలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితిలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాష్ట్రపతి పాలన విధించాలి. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హెూం మంత్రిని కలిసి అన్ని ఆధారాలను నివేదిస్తాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మిగతా 2లో..



## గ్రూప్-2 వాయిదా

- ఆగస్ట్ నుంచి డిసెంబర్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:

గ్రూప్–2 పరీక్షలను తెలంగాణ సర్కార్ వాయిదా వేసింది. ఆగస్టులో నిర్వహించాల్సిన పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం మిగతా 2లో..

TGPSC

➤ వివరాలు 02లో..

## మైక్రోసాఫ్ట్‌లో సర్వర్ ఇష్యూ

- విమాన సర్వీసలకు తీవ్ర అంతరాయం
- ప్రయాణికులకు నీళ్లు, ఆహార సేవలందించాలి
- అధికారులకు మంత్రి రామ్మోమన్ నాయుడు ఆదేశం..

➤ వివరాలు 02లో..





## బోనాలకు వేళాయే..



- ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీ ఏర్పాట్లు..
- ఆది, సోమవారాల్లో రెండ్రోలు బోనాల ఉత్సవాలు..
- 1500 మంది పోలీసులతో భారీగా బందోబస్తు..
- ప్రత్యేక వైద్య బృందాలు, బస్సులు..
- మహిళ భద్రత కోసం షీ టీంల గస్తీ..
- క్యూలైన్లలో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు
- హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:

రేపు, ఎల్లుండి జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. అధిక సంఖ్యలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించాలని ఆమె సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికోరారు. ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శాంతి కుమారి సమావేశం నిర్వహించి, ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయానికి భక్తులు వచ్చి, వెళ్ళే మార్గాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశామని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ అంక్షలు విధించి, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని పోలీసు అధికారులు తెలిపారు. బోనాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో 20వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. మిగతా 2లో..



నేటి ఫోకస్ న్యూస్

శనివారం 20, జూలై 2024

## వనపర్తి బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కవిత యాదవ్

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి పట్టణ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఆవుల కవిత యాదవ్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణ, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ లు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నిబంధనలకు అనుగుణంగా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అలివేలమ్మ, సీతారాములు, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, మాజీ జిల్లా అధ్యక్షురాలు కల్పన, లక్ష్మీ, కవిత, సరోజ, అర్చన, పుష్ప, అధికార ప్రతినిధి పెద్దిరాజు, రాయన్న సాగర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలి

**పెద్దవంగర, ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు–జూలై 19:**

సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహారావు అన్నారు. లయన్ పూర్వ జిల్లా గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహారావు జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి అధ్యక్షురాలు మాధవ పెద్ది వాణి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు , బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ....ప్రజల అవసరం మేరకు సేవలు అందించేలా లయన్స్ సేవా తరుణి సంస్థ పనిచేస్తోందని, మన సమాజంలో ఆపదలో ఉన్న పొరుగువారికి సహకారం అందించాలనే సదాశయంతో సేవా తరుణి సేవలు కొనసాగుతున్నాయని అన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజానికి పలు సామాజిక సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదుకునేందుకు సంస్థలు ముందుకు రావాలని, పేద విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సేవా తరుణి కార్యక్రమాల పరంపర కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యూసీ జిల్లా కోఆర్డినేటర్ వేలూరు శారద, జోన్ చైర్ పర్సన్ రేవూరి శ్రీదేవి, క్లబ్ కార్యదర్శి ఆమంచి రాధిక, ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం పి. రమేష్ ,చిట్యాల ఎంపీపీఎస్ ఇంచార్జ్ హెచ్ ఎం వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మహంకాళి రామచందర్

**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)–జూలై 19:**



మండల పరిధిలోని మాటేడు గ్రామానికి చెందిన మహంకాళి రామచందర్‌ను సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎడగండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రామచందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ..దేశంలో అన్ని వ్యవస్థలో అవినీతి పెరిగిపోయిందని దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలపై స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది.. అవినీతి నిర్మూలనకు సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారు..నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ కు ఈ పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా పెద్దల ఆదేశాలను అనుసరిస్తూ వారి కనుగుణంగా నడుచుకుంటూ మహబూబాబాద్ జిల్లాలో సమాచార హక్కు చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేస్తానన్నారు.

## గారాల రాము ఆకస్మిక మృతి

**పెద్దమండది, నేటి ఫోకస్ న్యూస్:**

మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు రాము శుక్రవారం ఉదయం ఆకస్మిక మృతి చెందాడు. కుటుంబ పోషణకు చేతగాక కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు అవరోధంగా మారిన వికలత్వంతో ఎవరినీ నొప్పించకుండా గారాబంతో యాచిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన రాము హఠాన్మరణం చెందడంతో మండల ప్రజలు సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాము కు తల్లిదండ్రులు లేకపోగా అన్నయ్య ఏ పని చేయని వికలాంగుడు కావడం వదిన అనారోగ్య బాధితురాలు కావడంతో రాము చేసే యాచకవృత్తితోనే కుటుంబం గడిచేది. అయితే రాము మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు వచ్చే పెద్దలను గారాబంగా అడుక్కుని 50 నుంచి అంతకంటే ఎక్కువే వసూలు చేసుకునేవాడు. ప్రతిరోజు యాచించే క్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే రాము యాచించే గారాబ స్థితిని చూసి తప్పించుకోలేక డబ్బులు ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో రాము ఆకస్మిక మృతి చెందడంతో అంత్యక్రియలకు సైతం మన పైసా లేకపోవడంతో స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి 10వేలు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి 8వేలు, స్థానిక ఎస్సీ కాలనీ వాసులు 16వేలు, సోషల్ మీడియా వేదికగా గూగుల్ పే ద్వారా సుమారు 13వేలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇది ఇలా ఉండగా సోషల్ మీడియా వేదికగా మండలంలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు, వివిధ శాఖల ఉద్యోగులు, సాధారణ ప్రజానీకం రాము మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు.

## భక్తులకు కనువిందు చేస్తున్న కాశీ జగద్గురువుల లింగపూజ

**నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, భామిని రఘుపతి (స్టేట్ కోఆర్డినేటర్)–జూలై18:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో భక్తులకు కనువిందు చేస్తున్న వీర శైవ సమాజ చౌకీమఠం నందు శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వర జగద్గురువులు1008 డాక్టర్ చంద్రశేఖరశివాచార్య మహాస్వామి వారి సాన్నిధ్యమున నిర్వహించబడుతున్న శివ పంచాక్షరి కోటి జప యజ్ఞ, సామూహిక హిత లింగార్చన, మహోత్సవం 7వ. సామూహిక ఇష్ట లింగార్చన, శివ పంచాక్షరి జప యజ్ఞం, జగద్గురువుల పాదపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అధ్యక్షుడు చీల మల్లన్న తెలిపారు. శుక్రవారం జగద్గురువుల సేవలో పిల్లోడి వీరన్న, జయమ్మ పుత్రుడు పిల్లోడి విశ్వనాథం భవాని కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురువులు మాట్లాడుతూ.. ఈ పవిత్ర ఆషాడమాసంలో శివ పంచాక్షరి మంత్ర జప యజ్ఞం సామూహిక ఇష్టలింగార్చన మహోత్సవం అత్యంత శ్రేష్టమైదన్నరు. సదాశివపేటలో జరుగుతున్న కార్యక్రమానికి నలుమూల గ్రామాల నుండి విచ్చేస్తున్న భక్తుల ఉద్దేశించి పూర్వజన్మ సుకృతమే ఈ కార్యక్రమంలో పాల్గొనే గొప్ప అవకాశం కలిగిందని జగద్గురువులు అన్నారు, తదుపరి జగద్గురువులు కార్యక్రమానికి విచ్చేసి నటువంటి భక్తులందరికీ పాద దర్శనము, మంగళ ఆశీస్సులు పొందారు.

# త్వరలో విద్యా కమిషన్

(మొదటి పేజీ తరువాయి..)

భేటీలో పాల్గొన్న ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, ఆల్డాస్ జానయ్య, పద్మజా షా, లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సూచనలు చేయడంతో పాటు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను రేవంత్ రెడ్డికి వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలకు బోధించే నైపుణ్యం ఉండడం లేదని, సరైన వసతులు లేవని ప్రొఫెసర్లు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రీ స్కూల్స్‌గా మార్చి వాలంటీర్లను తీసుకొని వారికి శిక్షణ ఇచ్చి పూర్వ ప్రాథమిక విద్యకు అవసరమైన శిక్షణ ఇచ్చేలా తీర్చిదిద్దాలనే యోచన చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. మూడో తరగతి వరకు ప్రీస్కూల్‌లో బోధన అందేలా చూసి, నాలుగు నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా స్కూళ్లకు వెళ్లేందుకు విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం యోచన తమకు ఉందన్నారు. పదేళ్లుగా యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది నియామకం జరగలేదని, వీసీలు లేరని ప్రొఫెసర్లు రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. వీసీల నియామకానికి ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశామని, త్వరలోనే వీసీల నియామకం పూర్తవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్స్ ఇవ్వాలని, ప్రతి యూనివర్సిటీలో వివిధ అంశాలపై లోతైన చర్చ, వాస్తవాల వెల్లడికి అభివృద్ధి చరిత్రకు సంబంధించిన అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ ఆల్డాస్ జానయ్య.. ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, తామంతా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే చదువుకున్నామని, ప్రపంచ దేశాలన్నీ తిరిగి వచ్చామని, ప్రస్తుతం ఓయూలోనూ విద్యా ప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో తీసుకురావల్సిన మార్పులపై విధాన పత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని రేవంత్ అన్నారు. ఆయా అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీతోనూ చర్చించాలని వారికి సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి, దీర్ఘకాల రుణాలు ఇస్తాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు వాటి సాధనకు ప్రయత్నిస్తున్నాయని ప్రొఫెసర్ ఆల్డాస్ జానయ్య.. ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆ అంశాన్ని పరిశీలిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యా శాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంపు అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, కచ్చితంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంచుతామని రేవంత్ తెలిపారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, బడ్జెట్ కేటాయింపులు తప్పకుండా పెంచుతామని భట్టి విక్రమార్క తెలిపారు. భేటీలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

# బోనాలకు వేళాయే..

(మొదటి పేజీ తరువాయి..)

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ చెప్పారు. 21,22న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు జరగనున్నాయని తెలిపారు. ఆదివారం మహంకాళి బోనాలు,ఆ తర్వాత రోజు రంగం, అంబారీ కార్యక్రమం ఉంటుందన్నారు. బోనాల జాతర సందర్భంగా ఈ సారి నెల రోజుల నుంచి ఏర్పాట్లపై కసరత్తు చేశామని చెప్పారు. మహంకాళి బోనాలకు 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. టెంపుల్ చుట్టూ పక్కల క్యూ లైన్లలో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడించారు. మహిళ భద్రత కోసం షీ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు.భక్తుల దర్శనానికి ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని లైన్లలో ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో రెండు ప్రత్యేక లైన్స్ బోనాలతో వచ్చే వారికి ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన సామాన్య భక్తుల దర్శనం కోసం క్యూ లైన్ ఏర్పాటు చేశాము. మరో రెండు లైన్లు దేవాలయం పాసులు జారీ చేసిన వారికి ఏర్పాటు చేశాం. అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చే వారికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాము. బోనం ఎత్తుకొని వచ్చే వారితో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుంది. ప్రసాదం కౌంటర్ల కూడా ఈసారి ఎక్కువగా ఏర్పాటు చేశాము. ఎగ్జిట్ పాయింట్ దగ్గర ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశాము. బోనాలకు వచ్చే వారు పోలీసులకు సహకరించాలి. గతేడాదితో పోల్చుకుంటే.. ఈసారి ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాము. అందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు డీసీపీ. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.10 నుంచి 15 లక్షలు మంది వస్తారని అంచనా. శివ శక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి. వాళ్లు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం 1:30నుండి 4 గంటల మధ్య వారు రావాలి. శివ శక్తులు, బోగినిలు బాటా నుంచి రావాలి.. జంక్షన్ నుంచి నేరుగా టెంపుల్ లోకి రావొచ్చు. ఒక్కో శివ శక్తులకు బోగినిలకుతో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుంది. వారితో గుంపులు గుంపులుగా వస్తారు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నామని అననారు. ఈసారి స్దానికుల అభిప్రాయాన్ని పలుమార్లు తీసుకున్న తర్వాతే ఏర్పాట్లు చేశాము. రెండు రోజుల పాటు మా బందోబస్తు ఉంటుంది. ఫలహారం బండ్ల కోసం ఈసారి రిజిస్ట్రేషన్ల పక్రియ పెట్టామని డీసీపీ రష్మి పెరుమాళ్ చెప్పారు.

**ప్రత్యేక వైద్య బృందాలు, బస్సులు..:** భక్తులకు వైద్యం అందించేందుకు ఐదు వైద్య బృందాలను నియమించినట్లు అధికారులు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు మూడు షిఫ్టుల్లో 150 మంది పారిశుధ్య కార్మికులను నియమించామని, ఆలయ పరిసరాల్లో మొబైల్ టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశామని హైదరాబాద్ మహానగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. పండుగ సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు రెండు 500 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు, డీజిల్ జనరేటర్లను అందుబాటు లో ఉంచామన్నారు. హైదరాబాద్ నగరంలోని 24 ప్రాంతా ల నుంచి ప్రత్యేక బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ నడపనుంది. ఎంజీబీఎస్, కాచిగూడ రైల్వేస్టేషన్, జేబీఎస్, చార్మినార్, బాలాజీ నగర్, నాంపల్లి, రిసాల బజార్, వెంకటాపురం, ఓల్డ్ అల్వాల్, మెహిదీపట్నం, కుషాయిగూడ, చర్లపల్లి, హకీంపేట్, ఓల్డ్ బోయిన్‌పల్లి, చార్మినార్, రాజేందర్‌నగర్, సైనిక్‌పురి, సనత్‌నగర్, జామై ఉస్మానియా, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, బోరబండ, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. బోనాలకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ కోరింది. ఈనెల 21, 22న ఈ సేవలు అందుబాటులో ఉంటాయని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. బస్సులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే 9959226147, 9959226143, 9959226130 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్లాట్‌ఫారమ్ నెంబర్ ఒకటి నుంచి రైల్వే స్టేషన్‌కు చేరుకునేటప్పుడు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని.. దీంతో ప్రయాణికులు చిలకలగూడ వైపు నుండి ప్లాట్‌ఫారమ్ నెం.10 నుంచి ప్రవేశాన్ని ఉపయోగించాలని పోలీసులు అభ్యర్థించారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి 2 కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని తెలిపారు. పొగాకు బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారి, బాటా రోడ్డు నుండి రాంగోపాల్‌పేట వరకు సుబాష్ రోడ్డులో రాకపోకలను దారి మళ్లించినట్లు తెలిపారు.

# ఏపీలో అరాచకం.. రాష్ట్రపతి పాలన విధించాలి

(మొదటి పేజీ తరువాయి..)

పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ దిగజారుడు రాజకీయాలపై కచ్చితంగా తమ పార్టీ నిరసన గళాన్ని వినిపిస్తుందన్నారు. 24వ తేదీన (బుధవారం) తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రంలోని పరిస్థితులు యావత్తు దేశానికి తెలిసేలా ఢిల్లీలో ధర్నా చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దురాగతాలను రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లేందుకు వారి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. ఏపీలో రాష్ట్రపతి పాలనను విధించాల్సిన అవసరాన్ని ఆధారాలతో సహా నివేదిస్తామని చెప్పారు. అసెంబ్లీలో ఉభయ సభల వేదికగా గవర్నర్ ప్రసంగం సమయంలో ఆటవిక పాలనపై ప్రశ్నిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని అమలు చేయకుండా దౌర్జన్యాలతో తెలుగుదేశం పార్టీ భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**పోలీసుల ప్రేక్షకపాత్ర..:** రాష్ట్రంలో దారుణమైన ఆటవిక చర్యలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. చివరికి టీడీపీ నాయకుల దాడుల్లో బాధితులైన వ్యక్తులు పోలీసుల వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటుంటే తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించే పరిస్థితి దాపురించింది. ఇలాంటి నీచ సంస్కృతి రాష్ట్రంలో రాజ్యమేలుతుండటం సిగ్గుచేటు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి వినుకొండలో రషీద్ దారుణ హత్య పెద్ద ఉదాహరణ. గతంలో పల్నాడు జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించే అధికారి రవిశంకర్ ఎస్పీగా ఉంటే తెలుగుదేశం నాయకులు తమ పలుకుబడితో ఆయన్ను తప్పించేశారు. అనంతరం వారికి అనుకూలంగా పని చేసే బిందుమాధవ్‌ను ఎస్పీగా తెచ్చుకుని అరాచక పర్వానికి తెరలేపారు. బిందు మాధవ్ ఎన్నికల సమయంలో అత్యంత దారుణంగా వ్యవహరించడంతో ఎన్నికల కమిషన్ స్వయంగా సస్పెండ్ చేసింది. తర్వాత మరో మంచి అధికారి మలికా గార్గ్‌ను ఈసీ నియమిస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెను సైతం పంపించేశారు. చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు సహాయ సహకారాలు అందించరనే కారణంతో మలికా గార్గ్‌ను తప్పించారు. ఇప్పుడు టీడీపీకే మద్దతు పలికే శ్రీనివాస్ అనే వ్యక్తికి పల్నాడు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. కొత్త ఎస్పీ వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే అత్యంత పాశవికంగా నడిరోడ్డుపై, ప్రజలంతా చూస్తుండగానే కత్తులతో నరికి రషీద్‌ను దారుణంగా హత్య చేశారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన సానుభూతి పరులను భయభ్రాంతులకు గురిచేసి, బెదిరించేందుకే అమాయకుడు, సాధారణ ఉద్యోగి అయిన రషీద్‌ను క్రూరంగా హత్య చేయడం దుర్మార్గం.

# నిండుకుండలా మేడిగడ్డ

(మొదటి పేజీ తరువాయి..)

నిండుకుండలా మేడిగడ్డ బ్యారేజీ. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయింది. కాళేశ్వరం కొట్టుకుపోయింది అని కాంగ్రెస్ పార్టీ, వందల కొద్ది యూట్యూబ్ ఛానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా.. వాళ్ళ కుల్లును, కుతంత్రాలును కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలని చూసి ఓర్వలేని వారు ఎన్ని కుట్రలు చేసినా ఎప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార.. సజీవ జలధార. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద కక్షతో కాళేశ్వరం మీద బురదజల్లే ప్రయత్నం ఎవరు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయం" అని బీఆర్‌ఎస్ అందులో పేర్కొంది. కాగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, అందుకే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు పగుళ్లు ఏర్పడ్డాయని అధికార కాంగ్రెస్ ఎన్నాళ్ల నుంచో విమర్శిస్తూ వస్తోంది. అంతే ధీటుగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ ఆరోపణలను తిప్పి కొడుతోంది.

**త్వరలో కేటీఆర్ పర్యటన..:** కాగా మేడిగడ్డ నిండుకుండను తలపిస్తుండంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. నిజం ఎన్నడూ దాగదని, కాంగ్రెస్ కుట్రలో బయటపడ్డాయని ఆయన విమర్శించారు. త్వరలోనే మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు వెళ్తున్నట్లు ఎక్స్ వేదికగా తెలిపారు.

# తెలంగాణలో గ్రూప్-2 వాయిదా

(మొదటి పేజీ తరువాయి..)

తీసుకుంది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించాలని మొదట నిర్ణయించగా నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో పరీక్షల తేదీలను మార్చింది. డీఎస్సీ పరీక్షలు జులై 18నుంచి ఆగస్టు 5వరకు ఉండటం వెంటనే గ్రూప్–2పరీక్షలు ఉండడంతో అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పలు ధర్నాల అనంతరం పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రూప్–2 రాతపరీక్షల తేదీలను త్వరలోనే వెల్లడించనున్నారు. గ్రూప్–2 వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య పెంచాలని గత నెల రోజులుగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు పలు రకాలుగా నిరసనలు వ్యక్తం చేశారు. నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్న నిరుద్యోగులపై పోలీసులు ఉక్కుపాదం మోపి లాఠీలు ఝుళిపించారు. ఇటీవలే అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి వేళ భారీ నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మొత్తం 783 పోస్టుల భర్తీకి గ్రూప్–2 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాయిదాతో పాటు పోస్టులు కూడా పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. 2 వేల పోస్టులు అదనంగా పెంచాలని నిరుద్యోగుల డిమాండ్. మరి పోస్టులు పెంచుతారా..? లేదా అనే దానిపై అనుమానం ఉందని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మైక్రోసాఫ్ట్‌లో సర్వర్ ఇష్యూ

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 19:**

మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యల కారణంగా విమాన సేవలు ప్రభావితమయ్యాయి. చాలా కంపెనీల విమానాలు ఎగరలేకపోతున్నాయి. భారతదేశంలో, ఢిల్లీ, ముంబై మరియు బెంగళూరు విమానాశ్రయాలలో విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సాంకేతిక సమస్యల తర్వాత భారత ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌ను సంప్రదించింది. అనేక దేశాల ప్రభుత్వాలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేశాయి. స్పైస్‌జెట్, ఇండిగో,అకాసా ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి సాంకేతిక సమస్యలను ఉదహరించాయి. ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు సర్వర్ సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోయాయని చెబుతున్నాయి. తాజాగా ఈ సమస్య పరిష్కారమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య వల్ల విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ అంశంపై తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతరాయం వల్ల ప్రభావితమైన ప్రయాణికులకు నీరు, ఆహారం అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు సానుభూతితో వ్యవహరించాలి. విమాన సర్వీసుల ఆలస్యం కారణంగా ప్రయాణికులకు అదనపు సీటింగ్, వాటర్, ఆహారాన్ని తప్పక అందించాలి. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణం కోసం టెక్నికల్ టీమ్ కృషి చేస్తోంది. ఇలాంటి సమాయాల్లో ప్రయాణీకుల సహకారం కూడా తప్పకుండా అవసరం. టెక్నికల్ సమస్య, విమాన సర్వీసుల రాకపోకలపై ఎలాంటి అప్‌డేట్ ఉన్నా ప్రయాణీకులకు వెంటనే తెలియజేయాలి. విమానాశ్రయాల్లో ప్రయాణీకుల అవసరాల కోసం అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాం. మైక్రోసాఫ్ట్ సంస్థతో అధికారులు టచ్‌లోనే ఉన్నారు. వీలైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

# కాంగ్రెస్ యువ నాయకుడు సంతోష్ యాదవ్ బుక్స్ పంపిణీ



- సంతోష్ యాదవ్‌ను అభినందించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్
- పంపిణీ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ హాజరయ్యారు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 19:** కంటోన్మెంట్ నియోజకవర్గం 150 డివిజన్ రెజిమెంటల్ బజార్ విద్యానికేతన్ హైస్కూల్ లో, 150 డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ యొక్క కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ హాజరై, విద్యార్థులకు నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ చక్కగా చదువుకొని మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి వెళ్లి చదువుతోపాటు, ఆట పోటీల్లో కూడా పాల్గొని, జనరల్ నాలెడ్జ్ మీద కూడా అవగాహన పెంచుకోవాలని, మీ తల్లిదండ్రులకు ఈ సమాజానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. పాఠశాల గురువులు కూడా విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించి, సమాజం పట్ల అవగాహన కల్పించి విద్యార్థులందరినీ మంచి ప్రయోజకులు చేసి సమాజానికి అందివ్వాలని కోరారు. ఇలాంటి



మంచి కార్యక్రమాలు ఇంకా ఎన్నో చేయాలని సంతోష్ యాదవ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరీ శంకర్, నందికంటి రవి, విజయ్ మరియన్, శ్రీనాథ్, అరవింద్ యాదవ్, అజయ్, శ్రీనివాస్, మల్లేష్, రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రూ.18లక్షలతో గవర్నమెంట్ పాఠశాలలకు బెంచీలు పంపిణీ

- అరిగే మధుసూదన్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని గవర్నమెంట్ పాఠశాలకు తోడ్పడాలి
- బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ పిలుపు



**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 29:** స్వాతంత్ర సమరయోధుడు అరిగే రామస్వామి మెమోరియల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రామస్వామి మనుమడు, అరిగే మధుసుధన్ సహకారం తో న్యూ బోయినపల్లి, బాపూజీనగర్, ప్రధామిక పాఠశాల, న్యూ బోయినపల్లి బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం బెంచీలు, టేబుళ్ళ వితరణ చేశారని, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు షెడ్రక్ తెలిపారు. శుక్రవారంనాడు జరిగిన ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంపన ప్రతాప్ హాజరై బెంచీలను, టేబుళ్లను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ... పేద విద్యార్థుల కోసం మధుసూదన్ తగిన సహాయ సహకారాలు అందజేయడం అభినందనీయమని, 20 పాఠశాలలకు 18 లక్షల రూపాయలతో బెంచీలు, టేబుళ్ళు తయారు చేయించారని మిగతావారు కూడా మధుసూదన్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనారోగ్య కారణాలతో మధుసూదన్ ఈ కార్యక్రమానికి రాలేక పోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం.చాముండేశ్వరి, ప్రైమరీ హెచ్ఎం ప్రేమలత, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లీల, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ తిరుమలగిరి మండల అధ్యక్షుడు హరినాథ్ రావు, ఉపాధ్యాయులు గౌస్, హారతి, కౌసర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా పరిషత్ సిబ్బంది బదిలీ

## బదిలీల ఉత్తర్వులను ఉద్యోగులకు అందజేసిన జడ్పీ సీఈవో యాదయ్య

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి జిల్లా పరిషత్ పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 51 మంది ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు బదిలీ అయిన ఉద్యోగులకు జెడ్పి సిఈఓ యాదయ్య శుక్రవారం బదిలీ ఉత్తర్వులు అందజేశారని పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గట్టుమీద భాను ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రషీద్ లు తెలిపారు. బదిలీల్లో భాగంగా పర్యవేక్షకులు ముగ్గురు, సీనియర్ సహాయకులు ఇద్దరు, జూనియర్ సహాయకులు 12 మంది, టైపిస్టులు ముగ్గురు, రికార్డ్ అసిస్టెంట్ లు 9 మంది, ఆఫీస్ సబార్డినేట్లు రెండు మందికి సాధారణ బదిలీలలో భాగంగా వారు కోరిన ప్రదేశాలకు బదిలీలు నిర్వహించారు. చాలాకాలం తర్వాత బదిలీలను ఎంతో పారదర్శకంగా చేపట్టిన జెడ్పి సీఈవో యాదయ్య ఉప ముఖ్యకార్వ నిర్వణా ధికారి రామ మహేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది లక్ష్మి కాంత్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రాఘవ, మల్లేష్, శ్రీకాంత్ లకు జిల్లా పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు భాను ప్రసాద్ తెలిపారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శ్రీనివాస గౌడ్ ఘన సన్మానం



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి ఆర్టీసీ డిపోలో యాదయ్య, దేవేందర్ గౌడ్‌లు సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి డిపో మేనేజర్లుగా బదిలీపై వెళ్తున్న వారికి మార్కెట్ చైర్మన్ బండారు శ్రీనివాస గౌడ్ ఘన సన్మానం చేశారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో సిబ్బంది ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమానికి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస గౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మం చారి, కాంగ్రెస్ నేత యాపర్ల రామ్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వారికి శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస గౌడ్‌కు ఘన సన్మానం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన బండారు శ్రీనివాస్ గౌడ్ కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. శుక్రవారం స్కాలర్స్ కళాశాల యాజమాన్యం సభ్యులు సత్యనారాయణ రెడ్డి, జగదీశ్వర్, నాగేశ్వరరెడ్డి లు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస గౌడ్ ఒకే పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా అంచెలంచెలుగా ఎ దుగుతూ రెండవ పర్యాయం మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకం కావడం శుభపరిణామమని వారు కొనియాడారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మం చారి పాల్గొన్నారు.



# బాల కళాకారులను ప్రోత్సాహించాలి

- డాక్టర్ కే.రాజేందర్ రెడ్డి



**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)- జూలై 19:** విద్యార్థుల్లో ధాగిన కళా నైపుణ్యం ను వెలికి తీసి ప్రోత్సహించడం అభినందనీయం అని ప్రముఖ వైద్యులు, లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డా. కుందూరు రాజేందర్ రెడ్డి, అన్నారు. గురువారం రాత్రి నితిన్ భవన్ లో వందే మాతరం ఫౌండేషన్ ఆద్వర్యంలో నవకల భారతి ఆర్ట్స్ అకాడమీ సౌజన్యంతో కలాం100 విద్యార్థులచే "బాల భారతం" పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ప్రముఖ రచయిత్రి, శతావధాని పౌరాణిక నాట క ప్రయోక్త జంద్యాల సుబ్బలక్ష్మి నాటకం ను సామాజిక అంశాల తో కూడిన సంభాషణలు,విద్యా ర్థులు అలవోకగా వినిపించడం, పౌరాణిక పాత్రలలో జీవించి నటించారు. వీరి నటన తీరు ఎంతో అనుభవం ఉన్న కళాకా రులతో సమానంగా ప్రదర్శించిడం అభినందనీయం అన్నారు. నోడల్ ఆఫీసర్ బుచ్చయ్య, డా.బి.రాజు మాట్లాడుతూ రంగాలంకరణ కాస్టుమ్స్, సంగీతం,విద్యార్థుల ఆహాభావాలు ఎంతో ఆకట్టుకున్నాయని కేవలం10 రోజులలో రిహల్సాల్ చేయడం అద్భుతంగా ప్రదర్శన ఇచ్చేలా ప్రాక్టీస్ చేయించడం, మేకప్, ప్రదర్శన బాగుందన్నారు. విఎంఎఫ్ డైరెక్టర్ టి.రవీంద్ర మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనకు సహకరించిన వారికి ధన్య వాదములని మున్ముందు కూడా ప్రోత్సహించాలని బాల కళోత్సవం చేపట్టెందుకు కళాభిమానులు ముందడుగువేయాలన్నారు. దర్శకత్వం రంగారావు, రచన జంద్యాల సుబ్బలక్ష్మి సమర్పకులు సురభి కొండల్ రావుతో పాటు మాశెట్టి రమేష్ జమున ఇమ్మడి రాంబాబు కస్తూరి పూలెందర్, ఆర్.యాకయ్య శివకుమార్ దారం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# డీలక్స్ బస్సులో ప్రయాణించి లక్కీ డ్రాలో గెలుపొందిన మహిళా విజేతలను ప్రకటించిన డిపో మేనేజర్ పద్మావతి




**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 19:** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం సబ్బండ వర్గాల మెప్పు పొంది దిగ్విజయంగా కొనసాగుతున్న క్రమంలో పల్లె వెలుగు ఎక్స్ప్రెస్ బస్సుల్లో మహిళ ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. అంతేకాకుండా మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం ఉండటం వల్ల బస్సు ల కొరత ఉన్నా కూడా డీలక్స్ బస్సుల్లో డబ్బులు పెట్టి వెళ్లేందుకు ససేమిరా మహిళ ప్రయాణికులు ముందు కు రావడం లేదు. లేట్ అయినా కూడా వేచి ఉండి డీ లక్స్ బస్సు అందుబాటులో ఉన్న కూడా ప్రయాణించకుండా ఎక్స్ప్రెస్ బస్సులోనే మహిళ ప్రయాణికులు ప్రయాణి స్తుండడంతో డీలక్స్ బస్సులో ప్రయాణం నల్లేరు మీద నత్త లాగా కొనసాగుతుండడంతో టిఎస్ఆర్టిసి డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలకు ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా సిస్టాన్ని ప్రవేశపెట్టి ప్రోత్సహించేందుకు సంస్థ నిర్ణ యం తీసుకుంది. ఆచరణలో అమలు చేసి చూపించింది. దీంతో కాస్త డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయా ణికుల సంఖ్య క్రమేపి పెరుగుతూ వస్తున్న క్రమంలో భాగంగా డీలక్స్ బస్సులో ప్రయాణించిన ప్రయాణపు లక్కీ డ్రా లను తొర్రూర్ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల మధ్యలో చిన్నారుల చేత లక్కీ డ్రా కూపన్లను తీయిం చి డిపో మేనేజర్ పద్మావతి ముగ్గురు విజేతల పేర్లను ప్రకటించారు. ఈ డ్రాలో మొదటి బహుమతిని గెలుచుకున్న తొర్రూర్ పట్టణానికి చెందిన విజయకు, రెండవ బహుమతి గెలుచుకున్న వరంగల్ పట్టణానికి చెందిన రుక్మిణికి, మూడవ బహుమతి గెలుచుకున్న హైదరాబాద్ పట్టణానికి చెందిన శారద లకు డిఎం చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పద్మావతి మాట్లాడుతూ.. డీలక్స్ బస్సులో ప్రయాణించే మహిళా ప్రయాణికులు ఎవరు కూడా అశ్రద్ధ చేయకుండా తమ టికెట్ల వెనకాల పేరు సెల్ నెంబర్‌ను రాసి డ్రైవర్ సీటు వెను క ఉన్న బాక్స్ లో బస్సు దిగేముందు వేసి వెళ్లాలని ప్రయాణికులను కోరారు. 15 రోజులకు ఒకసారి డ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులు పాల్గొన్నారు.

# కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు శ్రీనివాస గౌడ్ ఘన సన్మానం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బండారు శ్రీనివాస గౌడ్ శుక్రవారం ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ నగేష్‌లను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానం చేశారు. శ్రీనివాస గౌడ్‌తో పాటు మరికొందరు నాయకులు వెళ్లి వారిని వేరువేరుగా కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గౌడ్‌కు కలెక్టర్, అదనపు కలెక్టర్ లు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బ్రహ్మం చారి, మాజీ జెడ్పిటిసి వెంకట్రావు, పెబ్బేరు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కోదండరామిరెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, రామ్ రెడ్డి, మధు గౌడ్ పాల్గొన్నారు.





# దళారులను నమ్మి మోసపోవద్దు

- క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు చేసుకోండి
- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను తన క్యాంపు కార్యాలయంలో ఇవ్వాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి పథకాలను కొందరు దళారులు తాము చేయిస్తామని లబ్ధిదారులను మోసం చేసే అవకాశం ఉన్నందున ఎవరు కూడా మోసపోకుండా దరఖాస్తులను వనపర్తి లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేయాలని కోరారు. శుక్రవారం వనపర్తి పట్టణం, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. వనపర్తి పట్టణంలో 119 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అలాగే వనపర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 69 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద 38 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవినీతిరహిత పాలన కొనసాగుతోందని గత పాలకుల లాగా షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని అన్నారు.




# రేవంత్ రెడ్డిని కలిసిన ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రావుల గిరిధర్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రేవంత్ రెడ్డి సోదరుల విద్యాభ్యాసమంతా వనపర్తిలో జరగడంతో వారికి వనపర్తి పై అమితమైన ప్రేమ ఉంది. వనపర్తిని తమ సొంత ప్రాంతంగా భావించే వారు ఇక్కడి నుంచి ఎవరు వెళ్లిన చాలా ఆప్యాయంగా పలకరించి దగ్గరికి తీసుకుని మాట్లాడడం వారి నైజం. కాగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ వనపర్తి జిల్లా అధికారుల పట్ల చాలా ఉదారంగా ఉంటారని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు.

# నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక దృష్టి

- 22 కోట్లతో ఐటీ టవర్, 600 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- సానుకూలంగా స్పందించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ మల్లు రవి
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**



నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వనపర్తి మొదటి నుంచి విద్యాపర్తిగా ఎంతో ప్రాశస్త్యం కలిగి ఉండడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 22 కోట్లతో ఐటీ టవర్, 600 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎంపీ డాక్టర్ మల్లు రవిలకు ప్రతిపాదనలు అందజేయగా వారు సానుకూలత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. అలాగే వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందు వరసలో ఉంచేందుకు వివిధ శాఖల మంత్రులతో చర్చించి అధిక నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



# మధ్య తరగతి ప్రేమల జీవితమే పేకమేడలు




నటుడు రాకేష్ వర్రే ఒక పక్క నటుడిగా సినిమాలు చేస్తూ, ఇంకో పక్క కొత్త టాలెంట్ ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొత్తవాళ్ళకి అవకాశాలు ఇస్తున్నాడు. రాకేష్ వర్రే ఇంతకు ముందు 'ఎవ్వరికీ చెప్పొద్దు' సినిమాతో కథానాయకుడిగా విజయం సాధించాడు. తరువాత క్రేజీ యాంట్స్ అనే ఒక ప్రొడక్షన్ సంస్థని ప్రారంభించి నిర్మాతగా కూడా విజయం సాధించాడు. ఇప్పుడు మళ్ళీ నిర్మాతగా 'పేకమేడలు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమాలో తమిళ నటుడు వినోద్ కిషన్ కథానాయకుడిగా నటిస్తే అనూష క్రిష్ణ అతనికి జంటగా నటించింది. నీలగిరి మామిళ్ల దర్శకత్వం వహించారు. లక్ష్మణ్ (వినోద్ కిషన్) ఇంజనీరింగ్ చదివాడు, పెళ్లయింది, బాబు కూడా వున్నాడు, కానీ భాధ్యతలు లేకుండా ఎప్పుడూ మొబైల్‌లో పేకాడుతూ కాలం గడిపేస్తూ ఉంటాడు. పాపం భార్య కష్టపడి సంపాదించి ఇంటిలో దాచుకున్న డబ్బులు వెతికి మరీ తీసుకొని ఖర్చు పెట్టేస్తాడు. చేతిలో ఒక్క రూపాయి కూడా లేకుండానే, పెద్ద రియల్ ఎస్టేట్ డీల్ చేసేవాడిలా పోజులు ఇచ్చి ఒక్కసారిగా లక్షలు సంపాదించాలని అనుకుంటూ ఉంటాడు. ఆ కోవలోనే శ్వేత (రితికా శ్రీనివాస్) పరిచయం అవుతుంది, పరిచయం ఇంకాస్తా దూరం కూడా పోతుంది. ఇల్లు గడవడం కోసం భార్య వరలక్ష్మి (అనూష క్రిష్ణ) ఒక పోలీసాఫీసర్ ఇంట్లో పని చెయ్యడమే కాకుండా, కర్రీ పాయింట్ లాంటిది పెట్టి కష్టపడి డబ్బు సంపాదించాలి, కొడుకుని బాగా చదివించాలి అని అనుకుంటుంది. భార్య, బిడ్డ వారి గురించి ఆలోచన, భాధ్యత లేని లక్ష్మణ్ తానొక పెద్ద వ్యాపారవేత్త అని చెపుతూ శ్వేత వెనకాల తిరుగుతూ ఉంటాడు. ఇంతలో అనుకోని సంఘటన ఒకటి జరుగుతుంది, లక్ష్మణ్ బండారం బయట పడుతుంది. శ్వేతకి, లక్ష్మణ్ కి మధ్య వున్న సంబంధం వరలక్ష్మికి ఎలా తెలిసింది? తెలిసి ఆమె ఏమి చేసింది? శ్వేతకి లక్ష్మణ్ వ్యాపారవేత్త కాదన్న విషయం ఎలా బయటపడింది. భార్య భర్తల మధ్య చివరకి ఏం జరిగింది? ఇవన్నీ తెలుసుకోవాలంటే 'పేకమేడలు' సినిమా చూడాల్సిందే. కొత్త టాలెంట్ కూడా ఈ చిన్న సినిమా లతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతూ వుంటారు. అలాంటి కోవలోకే వస్తుంది పేకమేడలు' అనే సినిమా. సమాజంలో జరిగే ఒక సంఘటనని ఆధారంగా చేసు కొని ఈ సినిమా కథని రాసుకున్నాడు. ఒక పెద్ద సినిమా బాగోలేకపోయినా, టికె ట్ రేట్ ఎక్కువున్నా ప్రేక్షకుడు చూస్తాడు, కానీ వాటితోపాటుగా ఒక్కోసారి చిన్న సినిమాలని కూడా ప్రోత్సహించాలి. మొదటి సగం కొంచెం మామూలుగా వున్నా, రెండో సగం నుండి దర్శకుడు ప్రేక్షకుడిని కథలోకి తీసుకువెళతారు. భర్త వుద్యోగం చేస్తున్నాను అని భార్యని మభ్య పెట్టడం, మళ్ళీ కొన్ని రోజుల తరువాత వుద్యోగం లేదనటం, వాళ్ళిద్దరి మధ్య వాగ్యుద్ధం ఇవన్నీ సహజంగా చిత్రీకరించాడు దర్శకుడు. అలాగే కష్టపడకుండా ఎదో మాయమాటలు చెప్పి డబ్బు సంపాదించాలనుకునే లక్ష్మణ్ లు సమాజంలో ఎంతోమంది వున్నారు. అందుకే అతని పాత్ర ద్వారా చెప్పే సన్నివేశాలు ప్రేక్షకులని ఆకట్టుకుంటాయి. భర్త చెప్తున్న మాయమాటలు భరిస్తూ, ఓర్పుతో కష్టపడుతూ వున్న భార్యలు కొందరైతే, భర్త ఆగడాలు భరించలేక కొంతమంది భార్యలు ఎదురుతిరిగి మహిళా శక్తి ఏంటో కూడా చూపిస్తారు. ఈ సినిమాలో దర్శకుడు భార్యని రెండో కోవలో చూపించడం బాగుంది. ముఖ్యంగా పతాక సన్నివేశాలు సినిమాకి ఎంతో బలం. అలాగే భావోద్వేగాలు కూడా ప్రేక్షకులని ఆకట్టుకుంటాయి. సినిమాలో చాలా సన్నివేశాలు సహజంగా, మనచుట్టూ జరుగుతున్నవిగా కనిపిస్తూ ఉంటాయి. అందుకే 'పేక మేడలు' సినిమా ఆకట్టుకుంటుంది. సినిమాలో కథ, కథనం, భావోద్వేగాలు అన్నీ బాగా పండాయి, దర్శకుడు అవి బాగా చిత్రీకరించాడు. ఇక నటీనటుల విషయానికి వస్తే లక్ష్మణ్ పాత్రలో వినోద్ కిషన్ అతుక్కుపోయాడు. సహజంగా నటించి తన ప్రతిభని చూపించాడు. ముఖ్యంగా పతాకసన్ని వేశంలో అదరగొట్టాడు. ఇక అనూష క్రిష్ణ కూడా వినోద్ కిషన్ కి పోటీగా ఎంతో అద్భుతంగా నటించింది. అసలు ఆమెని చూస్తే నిజంగానే వరలక్షి అనే ఆమె వుంది అన్నంత సహజంగా నటించింది. పతాక సన్నివేశాల్లో భర్తపై తిరుగుబాటు చేసే భార్యగా ప్రేక్షకులతో చప్పట్లు కొట్టేంత బాగా చేసింది. రితికా శ్రీనివాస్ తన పాత్రకు తగ్గట్టుగా చేసింది. మిగతా పాత్రల్లో తమ పాత్రల పరిధి మేరకు చేశారు. రెండో సగంలో వచ్చే పాటలో మంచి భావుకత వుంది. సంగీతం, ఛాయాగ్రహణం బాగున్నాయి.

# నాని, శ్రీకాంత్ ఓదెల కాంబో..

## హీరోయిన్ జాన్వీకపూర్ అంటూ వార్తలు






'దసరా' సినిమా కాంబోలో మరో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి మరో సినిమా చేయబోతున్నారు. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్‌ని ఎంచుకొన్నట్టు వార్తలొస్తున్నాయి. చిత్రబృందం అధికారికంగా ఈ విషయంపై ఇంకా స్పందించకపోయినా జాన్వీ ఎంట్రీ దాదాపు ఖాయమేనని తెలుస్తోంది. జాన్వీకి మంచి క్రేజ్ ఉంది. తెలుగులో రెండు భారీ చిత్రాల్లో అవకాశం అందుకుంది. అయితే ఇప్పటికీ ఏదీ ప్రేక్షకుల ముందుకు రాలేదు.ప్రస్తుతం 'దేవర' షూటింగ్ తుది దశలో ఉంది. రామ్ చరణ్-బుచ్చిబాబు కాంబోలో రూపుదిద్దుకొంటున్న సినిమాలోనూ ఆమె కథానాయిక. 'పుష్ప 2'లో ఐటెమ్ సాంగ్ కోసం జాన్వీ పేరు తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు నాని అభిమానులు మరో చర్చ లేవనెత్తారు. నాని పక్కన జాన్వీ ఏమిటన్నది నేచురల్‌స్టార్ ఫ్యాన్స్ ప్రశ్న. 'నాని అన్నా.. నీకు జాన్వీ సెట్ కాదు..' అంటూ కొంతమంది ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా సలహాలు ఇస్తున్నారు. జాన్వీ అక్కలా ఉంటుందని కొంతమంది సెటైర్లు విసురుతున్నారు. 'దసరాలో కీర్తి సురేష్‌తో నీ జోడీ బాగుంది కదా, తననే తీసుకోండి' అంటున్నారు. 'హాయ్ నాన్న'లో మృణాల్ విషయంలో తప్పు చేశాడన్నది నాని అభిమానుల వాదన. ఆ సినిమాలో మృణాల్‌తో నాని కెమిస్ట్రీ మిస్ మ్యాచ్ అయ్యిందని, నాని పక్కన మృణాల్ వయసు ముదిరిన పిల్లలా కనిపించిందన్న కామెంట్లు వినిపించాయి. జాన్వీ విషయంలోనూ అదే జరుగుతుందన్నది అభిమానులు బెంగపడుతున్నారు. మరి నాని నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.




# రాజ్‌తరుణ్ కొత్త సినిమా పురుషోత్తముడు

ఓ వైపు లావణ్య వివాదం నడుస్తుంటే.. మరోవైపు తన సినిమాలను టాలీవుడ్ యువ నటుడు రాజ్ తరుణ్ చకచకా పూర్తి చేస్తున్నాడు. ఇప్పటికే భలే ఉన్నాడే సినిమాతో బిజీగా ఉన్న ఈ కుర్ర హీరో మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు. రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'పురుషోత్తముడు'. ఈ సినిమాకు రామ్ భీమన దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఒక గ్రామం కోసం.. అందులో ఉన్న ప్రజల కోసం డబ్బున్న ఒక కుర్రాడు.. తన అంతస్తును, హోదాను పక్కనపెట్టి ఏం చేశాడు అనేది ఈ సినిమా స్టోరీ అని తెలుస్తుంది. చూస్తుంటే మహేశ్ బాబు శ్రీమంతుడు వైబ్‌లు వస్తున్న కొత్తగా ఉంది. ఇక విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా టీజర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో హాసిని సుధీర్ కథానాయికగా నటిస్తుండగా.. మురళీశర్మ, కౌసల్య, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: గోపీ సుందర్, రచన-దర్శకత్వం: రామ్ భీమన.

# నితిన్ రాబిన్ హుడ్‌లో రాజేంద్రప్రసాద్




టాలీవుడ్ యాక్టర్ నితిన్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి రాబిన్‌హుడ్. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. లేడీ బాస్ శ్రీలీల స్టైలిష్ అవతార్‌లో హ్యాండ్ బ్యాగ్ వేసుకుని విమానంలో నుంచి దిగుతున్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. మూవీలో నటకిరిటీ రాజేందప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా నటకిరీటికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన లుక్ షేర్ చేశారు. ఇందులో ఏజెంట్ జాన్ స్నోగా కనిపించబోతున్నట్టు తెలియజేస్తూ రిలీజ్ చేసిన స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే డబ్బు చాలా చెడ్డది.. రూపాయి రూపాయి నువ్వేం చేస్తావే అంటే అన్నదమ్ములు, అక్కాచె÷-లలెళ్ల మధ్య చిచ్చు పెడతానంటది. అన్నట్టే చేసింది.. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ముళ్లు. ఆభరణాలు వేసుకున్నోళ్లంతా నా అక్కాచెలలెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు.. అంటూ గ్లింప్స్ వీడియోలో నితిన్ చెప్పే డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీలో నితిన్ దొంగగా సరికొత్త అవతారంలో కనిపించబోతుండగా వెన్నెల కిశోర్ కీ రోల్‌లో నటిస్తున్నారు. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మి?స్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.